# పాలకంకి

నాంకుంటలో బుడుబుంగలు ఈదుతూ ఈదుతూ బుడుంగున మునిగి ఎక్కడో తేలుతున్నాయి.

క్వాక్...క్వాక్ అని అరుస్తూ బాతులు ఆ కుంటలోకి దిగుతున్నాయి. అలా దిగుతున్నప్పుడు వాటి బరువైన బొజ్జలు ఊగుతున్నాయి వింతగా.

❊ ❊ ❊

తుమ్మల మీదికి గోరువంకలు, అడవి పావురాలువచ్చి వాలుతున్నాయి... పైకి ఎగురుతున్నాయి... ఆటలు ఆడుతున్నాయి.

కుంటబందు కున్న తుంగల మీద బసవన్నలు, ఆకుపచ్చని జింకలు వాలుతున్నాయి. దువ్వేనలు ముసురుతున్నాయి.

ఏమీ ఎరగనట్టు పొలం గట్టుమీది నుంచి గంభీరంగా నడిచివచ్చే తెల్లదుస్తుల రాజకీయ నాయకుల్లాంటి కొంగలు నీళ్ళలోకి దిగి పొడుగాటి ముక్కుతో బుడ్డపరకల్ని రొయ్యల్ని పట్టి తింటున్నాయి.

రొయ్య బండమీది నుంచి గొడ్లు మేతకు పోతున్నాయి.

కుంట కింది పొలాల్లో జనం పాటలు పాడుతూ నాట్లు వేస్తున్నారు.

బుచ్చిరెడ్డి పొలంలో పాటలులేవు. మాటలు లేవు. తిట్లూ బెదిరింపులూ ఉన్నాయి. అక్కడ కూలీలు, వంచిన నడుం ఎత్తకుండా యంత్రాల్లా పనిచేస్తున్నారు.

ఓదెలు కుంట కట్ట దిగువన ఎర్రల్ని తవ్వుతున్నాడు. వాడి తమ్ముడు ముత్తడు గాలాలు పట్టుకొని నుంచున్నాడు.

తవ్విన వాటిలో పిల్ల ఎర్రల్ని పట్టి ఇనుపగొట్టంలో వేస్తున్నాడు ఓదెలు. పొడుగాటి ఎర్రల్ని మాత్రం రెండు మూడు ముక్కలుగా నరికి గొట్టంలో వేస్తున్నాడు. ఒక్క చేపకోసం అంతంత పొడుగు ఎర్రని వేయటం వాడి కిష్టం ఉండదు. వాడికి తెలియదు కానీ, వాడిలో గొప్ప రాజకీయ లక్షణాలున్నాయి.

ఓదెలు తమ్ముడు ముత్తడు. వాడు అమాయకుడు. వాడికీ మాయలు, మర్మాలు తెలియవు. అబద్ధాలు రావు. అంచేత వాడు మాత్రం రాజకీయ నాయకుడు కాలేదు. అయితే గియితే బడిపంతులు కావచ్చు కానీ అదీ కాలేదు. బడికీ, వాడికి గడ్డివాముకు, పరాయి గొడ్డుకూ ఉన్నంత దూరం!

పొరపాటున బడి ఛాయలకు పోయాడో వాళ్ళ తండ్రి వీరయ్య 'సెడిపోతవురా' అని చెవులు మెలేసి తీసుకుపోతాడు. ముల్లుగర్ర చేతికిచ్చి గొడ్లను కాయడానికి పంపుతాడు.

రోజూ గొడ్లను తోలుకొని ఓదెలు, ముత్తడు రొయ్య కుంట బండమీదికి వస్తారు. అది మామూలు బండ కాదు. పెద్ద గుట్టంత ఎత్తున్న బల్ల పరుపు బండ!

చుట్టుపక్కల పొలాల వాళ్ళు పంటలు కోసిన తరువాత ఆ బండ మీదే బంతులు కడతారు. తూర్పారబట్టి గింజల్ని తాలును వేరు చేసి బండ్ల మీద గింజల్ని ఇండ్లకు మోసుకుపోతారు.

ఆ కాలంలో గొడ్లు బండమీదుగా మేతకు వెళ్ళడానికి వీలుపడదు. అలా జరిగితే గోడ్లకాపర్లకు గొడ్డు కారం, గట్క కూడా కరువే - వీపులు తీపులు తీసేన్ని దెబ్బలు!

బండచుట్టూ తిరిగి బంజరు భూముల్లోకి, మోదుగుల వనంలోకి గొడ్లు మేతకు వెళ్ళాయి.

ప్రస్తుతం బంతులు కట్టే కాలం కాదు గనుక. రొయ్యకుంట బండమీద గొడ్లను వొదిలి నాంకుంటలో చేపలు పట్టడానికి వచ్చారు ఓదెలు. వాడి తమ్ముడు ముత్తడు.

వారితో చేరి అప్పుడప్పుడు వెంకటేశు కూడా గాలాల్తో చేపలు పడతాడు. కుంటలో ఈతలు కొడ్తాడు. కొతికొమ్మచ్చి, సిర్రగోనె ఆటలు ఆడ్తాడు.

అయితే ఆ రోజు కుంట కట్టకు చేరుకున్న వెంకటేశు ఎప్పటిలా ఉత్సాహంగా, సంబరంగాలేడు. కనీసం రాళ్ళను, పెంకుల్ని నీళ్ళలోకి విసరడం లేదు. కప్పగంతులు వేయించడం లేదు.

బడికిపోతున్నప్పటి నుంచి వెంకటేశుకు అన్నీ కష్టాలే.

ఆ రోజు వెంకటేశు పాలబుగ్గల మీద ఏడ్పుచారికలున్నాయి.

వెంకటేశు పాల మనసు... పొయ్యిమీద పాలలా మరిగిపోతున్నది. కోపంగా ఉన్నాడు వెంకటేశు.

***

పొద్దు వాలిపోయింది.

పశువులు మందనుంచి ఇండ్లకు వస్తున్నాయి.

కొడుకు వెంకటేశు బడి నుంచి ఇంకా రాకపోయే సరికి తల్లి ఎంకమ్మ కలవరపడింది.

ఇంట్లో కాలు నిలవలేదు. పెద్ద కొడుకును గెదుముదామంటె నారు మండెకు నీళ్ళు పోయడానికి వెళ్ళాడు.

తనే చిన్న కొడుకు జాడకు బయలుదేరింది ఎంకమ్మ.

దారిలో వెంకటేశు జతగాడు శివయ్య కనిపించాడు.

"మా ఎంకటి కనబడ్డదా శివన్నా?" అని అడిగింది.

"లే...కనిపించలే పెద్దమ్మా–" అని ఆ రోజు బడిలో జరిగిన సంఘటన గురించి చెప్పాడు శివయ్య.

అయితే 'ఎంకటికి కోపం వచ్చింది.అలిగాడు' అని తెలుసుకున్నది ఎంకమ్మ.

అలిగినప్పుడు వెంకటేశు ఎక్కడికి వెళ్ళి కూర్చుంటాడో ఆ తల్లికి తెలుసు.

ఆ మసకచీకట్లో రొయ్యబండ మీద మోకాళ్ళ మధ్య తల పెట్టుకుని కూర్చున్నాడు వెంకటేశు.

బతిమాలి బామాలి కొడుకును ఇంటికి తీసుకుపోయింది ఎంకమ్మ.

ఉడుకుడుకు నీళ్ళుపోసి, ఉతికిన దుస్తులు తొడిగింది. తల దువ్వింది. గడ్డ పెరుగు వేసి అన్నం పెట్టింది.

"తినను పో" అని మారాం చేశాడు వెంకటేశు.

"తిను బిడ్డా..." అని బతిమిలాడింది ఆ తల్లి.

"ఉహూఁ.... నా కొద్దు" అని మొహం తిప్పుకున్నాడు.

"నీ బాంచెన్రా..." అని గదును పట్టుకుంది తల్లి.

వినలేదు. అన్నం తినలేదు వెంకటేశు!

"నీ కాళ్ళు మొక్కుతరా..."

"ఉహూఁ..."

"నీ కడుపుల పుడతరా..."

"పో... నా కొద్దు పో..."

"తిను బిడ్డా... తిన్రా నన్ను ఒర్లించకురా..."

"తిన పో..."

"తినవా?..."

"ఉహూఁ..."

"ఇట్ల తల కొట్టుకుని సావనా చెప్పు..."

"మరి వాడు నన్నెందుకు కొట్టాలె?" కోపంగా అడిగాడు వెంకటేశు.

"ఎవలు! దొర కొడుకా?"

"ఆఁ..."

"నువ్వు గా పిలగాని మీదికి సెయ్యి లేపుతవా? తప్పు గాదూ!"

"ఆడే ముందుగాల నామీనికి చేయి లేపిండు...కొట్టిండు."

"అళ్ళంటే పెద్దోళ్ళు... కొడ్తె నువ్వు మళ్ళ కొడ్తవా?"

"ఆడు నాకంటె పెద్దనా? ఆడునేను ఒకటే ఎత్తున్నం. ఒకటే తర్గతి చదువుతున్నం గదా?"

"అళ్లు గొప్పోళ్ళు బిడ్డా?"

"గొప్పోళ్ళంటే?"

"ముందుగాల బువ్వ తిను బిడ్డా.గయన్నీ అటెంక అడుగుదువు."

"ముందుగాల చెప్పినంకనే తింట-"

"ఇగ నీతోని నాకు సాతగాదురా... వాని గుడిగుండంగానూ... గా దేవుడు మీ అయ్యను ఉంచి నన్ను కొంటబోకపాయె. గీ గోస నా కుండక పోవు. గీ ఏడ్పుడు ఉండకపోవు..." అని కంట తడిపెట్టుకున్నది ఎంకమ్మ.

తల్లి కంట తడి చూసి మారు మాట్లాడకుండా వెంకటేశు ఓ ముద్ద తిన్నాడు.

"అవ్వా..."

"ఉఁ..."

"గొప్పోళ్ళంటె ఏందె?" అని మళ్ళీ తల్లిని అడిగాడు.

"బగ్గ పైసలున్నోళ్లు" అని చెప్పింది ఆ తల్లి.

"బగ్గ పైసలుంటే గొప్పోళ్లా?"

"ఆఁ..."

"మరి మంచోళ్ళంటె ఎవలే?"

"మంచి పన్లు సేసేటోళ్ళు..."

"నీలమ్మ కంకి గింజలు పెట్టె తింటే తప్పా?"

'కా' దన్నట్లు తల అడ్డంగా తిప్పింది తల్లి.

ఆ రోజు మధ్యాహ్నం భోజనం చేసి బడికి తిరిగి వస్తున్నాడు వెంకటేశు.

ఊరి చివర ఉంది బడి.

గూడెం దాటి వస్తుంటె నీలమ్మ కలిసింది. ఆ అమ్మాయి, తనూ ఒకే తరగతి చదువుతున్నారు.

"ఎంకటేసు... ఎంకటేసు నీకు పాలకంకి ఇష్టమేనా?..." అని అడిగింది. తలూపాడు వెంకటేశు.

"ఇంగో..."

గౌను మడతచాటుకు దాచుకున్న పాలకంకి తీసి చూపించింది.

దోరగా కాల్చిన ఆ పాలకంకిని చూడగానే నోరూరుతోంది.

"ఇంగపట్టు... తిను..." నాలుగు గింజలు వొలిచి వెంకటేశు చేతిలో పోసింది నీలమ్మ.

ఇష్టంగా తిన్నాడు వెంకటేశు, తీయగా, చక్కెర పాకంలో ముంచినట్లున్నాయి ఆ లేత గింజలు.

బడి చేరుకునేదాకా వెంకటేశుకు గింజలు వొలిచిపెడుతూ, తాను తింటున్నది

నీలమ్మ.

చలపతి దొర కొడుకు శేఖర్ అది చూసి "చెవ్వా..... గది గింజలు పెడ్తె తింటానావు!" అని వెంకటేశును ఎద్దేవా చేశాడు.

"తింటా నా ఇష్టం" అన్నాడు వెంకటేశు.

"ఛీ... ఛీ... గిరిగిల్ల... గిరిగిల్ల..." అంటూ చూపుడు వేలు మీదికి మధ్య వేలును ఎక్కించి పట్టాడు శేఖర్.

"అరే సమ్మయ్య... సత్తిగా, వీరిగా... శెట్టిగా... వెంకటేశును ముట్టుకోకుండిరా... గిరిగిల్ల వేసుకోండి" అని తన మిత్రులను హెచ్చరించాడు.

శేఖర్ చెప్పినట్లుగా ఆ పిల్లలంతా గిరిగిల్లలు వేసుకుని వెంకటేశుకు దూరంగా జరిగారు.

"ముట్టుకుంటే... ఏం చేస్తరు..." రోషంగా అడిగాడు వెంకటేశు.

"ముట్టుకుంటె సూడు... ఏం చేస్తనో..." శేఖరు బెదిరించాడు.

"ఏం చేస్తవురా!" ఆ అబ్బాయి మీది మీదికి వెళ్ళాడు వెంకటేశు.

"మా నాన్నకు చెప్త సూడు..." అన్నాడు శేఖర్.

"చెప్పుకో... చెప్పుకో... చెప్పుతో తన్నించుకో..."

"నిన్నే తన్నిస్తా... ఒరే గిరి, హరి, సారాజ్జెం... సరస్వతి గిరిగిల్ల వేసుకోండ్లి ఎంకటేశుగాడు నీలమ్మను ముట్టుకున్నడు. అది పెట్టిన గింజలు తిన్నడు." అప్పుడే స్కూలు చేరుకున్న మిగతా మిత్రులకు చెప్పాడు శేఖర్.

"చెవ్వా...గిరిగిల్ల...గిరిగిల్ల..."

శేఖర్ దోస్తులంతా చుట్టూ చేరి వెంకటేశును గేలిచేయసాగారు.

దోషిగా దూరం నిల్చున్న నీలమ్మ వాళ్ళవంక బెదురుబెదురుగా చూస్తున్నది.

అంటరానితనం పాపం అనేవాళ్ళే ఆ గ్రామంలో మహా పాపులు!!

చదువుకునే గూడెం పిల్లలు తక్కువ. అందులో ఆ బడిలో చదువుకునే పిల్లలు అంతా తక్కువ. వాళ్లను బడిలో ప్రత్యేకంగా కూర్చోబెడతారు.

ఇది స్వాతంత్ర్యానికి ముందున్న పరిస్థితి కాదు. అక్షరాలా పందొమ్మిది వందల ఎనభైతొమ్మిదిలో ఒక గ్రామంలోని పరిస్థితి.

నీలమ్మ పెట్టిన కంకి గింజలు తిన్నందుకు గిరిగిల్ల...గిరిగిల్ల అని తనను దూరంగా తరుముతుంటే వెంకటేశుకు ఉక్రోషం పెరిగింది.

శేఖరాన్ని అందుకుని ముట్టుకున్నాడు.

ఆ అబ్బాయికి పట్టరాని కోపం వచ్చి "నన్ను ముట్టకుంటావురా!" అని వెంకటేశు దవడమీద ఈడ్చికొట్టాడు.

వెంకటేశు కూడా శేఖర్ మీదికి చేయి లేపాడు.

అప్పుడే అక్కడికి వచ్చిన పంతులుగారు ఆ దృశ్యం చూసి హడలిపోయి వెంకటేశు చేయిపట్టి ఆపారు.

వెంకటేశు జరిగిందంతా చెబుతున్నా - "నీకేం పోయే కాలంరా! దొర కొడుకు మీద చేయి చేసుకుంటావా?" అని తిట్టారు. కొట్టారు.

వెంకటేశుకు దుఃఖం వచ్చింది. శేఖర్ కొట్టినందుకు కాదు. పంతులుగారు కూడా తననే కొట్టినందుకు... పుస్తకాల సంచి భుజాన వేసుకుని బడినుండి వెళ్ళిపోయాడు. కళ్ళనీళ్ళు తుడుచుకుంటూ కుంట చేరుకున్నాడు.

***

"నీలమ్మను ముట్టుకుంటే గిరిగిల్ల అనే టోళ్ళు మంచోళ్ళా? చెడ్డోళ్ళా?" అన్నం తింటూ తల్లిని అడిగాడు వెంకటేశు.

"చెడ్డోళ్ళు." అని చెప్పింది తల్లి.

"మరి శేఖర్‌గాడు చెడ్డాడే గదా?"

"నువ్వు బువ్వ తిను బిడ్డా - నన్ను వొర్లించకురా-"

"తింటాన్నే..."

"జల్దిన బువ్వ తిను బిడ్డా - బర్రె పాలు పిండాలె గాదు...

కొడుక్కు అన్నం తినిపించి గేదె పాలు పితకడానికి కొట్టం దగ్గరికిపోయింది. ఎంకమ్మ.

తల్లి కొంగుకు మూతి తుడుచుకుంటూ ఆమె వెనక నడిచాడు వెంకటేశు.

"అవ్వా..." అని మెల్లగా పిలిచాడు.

కొడుకు అన్నం తిన్నందుకు ఆ తల్లికి తృప్తిగా ఉంది. అందుకే శాంతంగా -

"ఏందో సెప్పు బిడ్డా..." అన్నది.

"నీలమ్మోళ్ళను ముట్టుకోవద్దని ఎందుకంటారు?"

మాట్లాడలేదు ఎంకమ్మ.

"ఆళ్ళూ మనలెక్క మన్సులే కదా?"

"అవ్ కొడుకా... - ఆళ్ళు కూడా మనలెక్క మన్సులే..."

"మరి నీలమ్మ పెట్టిన గింజలు తింటె గా శేఖర్‌గాడు గిరిగిల్ల అనుడు తప్పు కాదా? -"

"తప్పే బిడ్డా..."

"తప్పు చేసిన ఆ శేఖర్‌గాన్ని సార్ ఎందుకు కొట్టలేదు మరి?..."

జవాబు చెప్పలేక పోయింది తల్లి.

అది మామూలు ప్రశ్న కాదు...

పంతుళ్ళను తమ పాత్ర నిర్వహించనివ్వని సమాజాన్ని కుదిపే ప్రశ్న...!!

*ఆంధ్రభూమి వార పత్రిక, 13-6-1990*